క్లుప్తంగా

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న సురేష్‌కుమార్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

హుకుంపేట: ఏజెన్సీలో ఆదివాసీ అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటన వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు తెడబారికి సురేష్‌కుమార్, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో ఆనంద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ, ఆదివాసీ నిరుద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన జీపు జాతా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏజెన్సీలోని గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, నాయకులు కృష్ణారావు, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

కొయ్యూరు: గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో 27, తొమ్మిదో తరగతిలో ఆరు ఉన్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.నరసింహరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.నేరుగా పాఠశాలకు వచ్చి వివరాలు అందజేయాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు



బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొయ్యూరు: ఇటీవల విశాఖలో జరిగిన కరాటే పోటీల్లో పెదమాకవరం పాఠశాలకు చెందిన పి.గాయత్రి గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించడంపై బుధవారం పాఠశాల హెచ్‌ఎం సంధ్య బాలికకు ప్రశంసాపత్రాలను, మెమొంటాలను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు బాలికను అభినందించారు. బూదరాళ్ల పంచాయతీ గరిమండకు చెందిన గాయత్రి ఇటీవల విశాఖలో జరిగిన కరాటే పోటీలలో పాల్గొని బంగారు పతకం సాధించినట్టు చెప్పారు. కరాటే కాటా స్టయిల్ ఏ, బీ విభాగాల్లో బాలిక ఐదో తరగతి చదువుతోన్న గాయత్రి రెండు మెడల్స్ సాధించడం ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు శ్రీదేవి, లక్ష్మిదేవి, సుజాత, శ్యామల వెంకటేశ్వర్లు చెప్పారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



అంతర్లలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ తిరుమలరావు

చింతపల్లి: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీ బి.వి.తిరుమలరావు అన్నారు. చింతపల్లి పంచాయతీ అంతర్ల సచివాలయం పరిధిలోని రైతులకు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో రైతులు వరినారు చిగుళ్లను తుంచి జీవామృతంలో ముంచి ఒకటి రెండు మొనలతో నాట్లు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చునన్నారు. అనంతరం సచివాలయంలో రైతు సదస్సును నిర్వహించారు. ఏఓ మధుసూదనరావు, సర్పంచ్ దురియా పుష్పలత, వీహెచ్‌లు శోభన్, ఏఈఓ ధర్మారాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో మెకానిక్ కోర్సు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి: విద్యార్థులు ద్విచక్ర వాహనాలతో పాటు ఆటో మెకానిక్ నేర్చుకోవడంలో శ్రద్ధ చూపాలని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయ భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు 45 రోజుల ద్విచక్ర, ఆటో మెకానిక్ సర్టిఫికెట్ కోర్సును బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు స్వయం ఉపాధి పొందే విధంగా వృత్తి నైపుణ్య కోర్సులను నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరమన్నారు. అకడమిక్ కో–ఆర్డినేటర్ వి.రమణ మాట్లాడుతూ ప్రతి రోజు ఒక గంట పాటు విద్యార్థులకు ఈ మెకానిక్ కోర్సుకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

మా దారి.. రహదారి

• హైవే మధ్యలో తిష్ట వేస్తున్న పశువులు • వాహనచోదకుల అవస్థలు • పెరుగుతున్న ప్రమాదాలు • పట్టించుకోని అధికారులు



అరకు జాతీయ రహదారి వద్ద తిష్ట వేసిన పశువులు



.డుంబ్రిగుడ ప్రధాన రహదారిపై పశువులు



చాపరాయి వద్ద పశువుల సంచారం



అంత్రిగుడ వద్ద రోడ్డుపై పశువుల సంచారం



రాత్రి పశువులు పడుకొని ఉండడంతో తప్పించుకొని వెళ్తున్న వాహనచోదకుడు

డుంబ్రిగుడ: జాతీయ రహదారి మధ్యలో పశువులు సంచరించడం, తిష్టవేయడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా పశువులు రోడ్డుపై సంచరిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ కారణంగా మనుషులు, లేగదూడలు తీవ్ర గాయాలబారిన పడుతున్నాయన చెబుతున్నారు. పశువులు రోడ్డుపై తిష్టవేడయంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని చెబుతున్నారు. రాత్రిళ్లు, తెల్లవారుజామున మంచు కురుస్తుండడంతో పాటు పశువులు తిష్టవేసి ఉండడంతో ఎదురుగా ఉన్నవి కనిపించక వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డుంబ్రిగుడ, కించుమండ, అరకు జాతీయ రహదారిపై నిత్యం పశువులు తిష్ట వేసి ఉన్నా ఆయా పంచాయతీ సిబ్బంది, పశువుల యజమానులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువుల శాలల్లో పశువులను ఉంచకుండా, వాటిని కట్టకుండా యజమానులు వదిలేయడంతో అవి రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక ప్రదేశం చాపరాయి వద్ద మొక్కజొన్న కండెలు తినేందుకు పశువులు ఎక్కువగా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నాయని, చాపరాయి సిబ్బంది పటించుకోవడం లేదని పర్యాటకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ప్రమాదానికి గురయ్యా



ఇటీవల జాతీయ రహదారిపై వెళ్తుండగా పశువులు పడుకొని ఉండడంతో అకస్మాత్తుగా ప్రమాదానికి గురై గాయాలపాలయ్యాను. రోడ్డుపై పశువులు సంచరించకుండా యజమానులు పశువుల శాలల్లో కట్టి ఉంచితే బాగుంటుంది.

– బి.రవికుమార్, డుంబ్రిగుడ

పంటలు నాశనం



ఆవులు మార్కెట్‌లోకి వచ్చి కూరగాయాలు తినేస్తున్నాయి, అలాగే గరువులు, పొలాలవద్ద చేరి పంటలను నాశనం చేస్తున్నాయి. పశువుల యజమానులతో పంచాయతీ అధికారులు మాట్లాడి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– నాగేశ్వరరావు, వ్యాపారి, డుంబ్రిగుడ

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ చిన్నారిని ఒడిలో పెట్టుకుని మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ధనలక్ష్మి

రంపచోడవరం: రంపచోడవరం మండలం నిమ్మలపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో బలిజ వీరపురెడ్డి భార్య, కుమార్తె మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం పరామర్శించారు. ఇల్లు కాలిపోతున్న తరుణంలో బిడ్డను కాపాడుకోవాలనే తపనలో ఇంటికి వెళ్లి బిడ్డను బయటకు తీసుకొస్తున్న ఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలు కావడం, వైద్యం కోసం తరలించగా చనిపోవడం చాలా బాధాకరమన్నారు. భగవంతుడు ఆ కుటుంబానికి మనో ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, పార్టీ ఎస్టీ సెల్ కన్వీనర్ పండా రామకృష్ణదొర, మండల పార్టీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ, సర్పంచ్ పల్లాల సీతమ్మ, కారం నాగ విజయ, పార్టీ నాయకులు బొప్ప శేఖర్, చితుకులయ్యరెడ్డి, పండు సూరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీసా కమిటీ ఉపాధ్యక్షులు,కార్యదర్శులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని కోరుతూ కించాయిపుట్టు పీసా కమిటీ ప్రతినిధులు ఆర్.పద్మనాభం, పి.సుబ్బారావు, సిహెచ్.విశ్వనాథం పడాల్, కె.నారాయణ కోరారు. ఈ మేరకు వారు తహసీల్దార్‌ను శంకరరావును బుధవారం కలిశారు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ, ప్రభుత్వ భూములు అక్రమణలపై ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుందని, వాహనాలు వెళ్లేందుకు ఇరుకైన రోడ్డుతో అవస్థలు తప్పడం లేదని, గతంలో రోడ్డు విస్తరణ కోసం రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించి నిలిపి వేశారన్నారు. రహదారికి ఇరువైపులా దుకాణాలు, గృహాలను తొలగించి విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలని, ప్రభుత్వ భూములు అనేకచోట్ల అక్రమణకు గురవుతున్నాయని, వెంటనే స్వాధీనం చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ శంకరరావు మాట్లాడుతూ త్వరలోనే మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులు ప్రారంభిస్తామని, ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

ఘనంగా కలశ ప్రతిష్ట

మునగపాక: ఉమ్మలాడలో పునర్నిర్మించిన శ్రీదేవీ తల్లి అమ్మవారి ఆలయ వేడుకల్లో భాగంగా బుధవారం కలశ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. 7న చండీ హోమం , 8న ఊరేగింపు, 9న భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆత్మీయ సన్మానం



బదిలీపై వెళ్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఏడీఏ తిరుమలరావు, సిబ్బంది

చింతపల్లి: మండలంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసరావును బుధవారం ఘనంగా సన్మానించారు.ఇక్కడ రెండేళ్ల పాటు విధులు నిర్వహించిన వ్యవసాయ అధికారి శ్రీనివాసరావకు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయింది. ఈ సందర్భంగా సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి. తిరుమలరావు, ఏవో టి.మధుసూదనరావు, సిబ్బంది తదతరులు శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు.

10న ఏపీజీఈఏ ఎన్నిక

చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 10న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులసంఘం(ఏపిజీఈఏ)కార్యవర్గ ఎన్నిక చింతపల్లిలో నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి డి.వి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. చింతపల్లిలో 10న ఉద్యోగ సంఘం సమావేశంతో పాటు, కార్యవర్గ ఎన్నికలు కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు.ఈ ఎన్నికలకు పరిశీలకునిగా జిల్లా కార్యదర్శి జగన్మోహనరావు వ్యవహరిస్తారని చెప్పారు. ఈ కార్యవర్గ ఎన్నికలకు చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలు ప్రభుత్వ ఉద్యోగులు సంఘం సభ్యులంతా హాజరుకావాలని కోరారు.విశాఖ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలుచేయాలి



కూనవరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆదివాసీ ఏజేసీ నాయకులు

కూనవరం: ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలకు రక్షం కల్పించాలని, ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్, ఆదివాసీ హెల్త్ అండ్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 8న మారేడుమిల్లిలో జరగనున్న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఇంటింటా కరపత్రాలు పంపిణి చేస్తూ చట్టాలు, జీవోలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి ఏజన్సీ ప్రాంత ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మారేడుమిల్లిలో జరగనున్న ఆదివాసీ దినోత్సవానికి అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రామాంజనేయులు, పగేష్, సతీష్, శశిప్రకాష్, జీవన్, ఖిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



సీలేరులో కళాజాత ప్రదర్శన

సీలేరు: సీలేరులోని గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై బుధవారం కళాజాత నిర్వహించారు. సర్పంచ్ పాంగి దుర్గో అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను కళాకారులు నాటక రూపంలో వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని , పొడి చెత్త, తడి చెత్తను వేరు చేయాలని, దోమల నియంత్రణకు గ్రామస్తులు సహకరించాలని అపుడే వ్యాధుల బారిన పడకుండా ఉంటామని తెలియజేశారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌ను కలిసిన ఎంఈవో–2 నాగేశ్వరరావు



జి.మాడుగులలో ఎంఈవో–2గా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణమూర్తిని సన్మానిస్తున్న యుటీఎఫ్ నేతలు

డుంబ్రిగుడ: మండలంలోని విద్యాశాఖాధికారి–2 బి.బి.నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ప్రేమ్‌సాగర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సందర్శంచి మధాహ్నం భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో–1 శెట్టి సుందర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఎంఈవో–2గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె.వెంకటరమణమూర్తిని ఉపాధ్యాయ సంఘాలు, ఆశ్రమ పాఠశాల పీజీ హెచ్‌ఎంలు, విద్యాశాఖ సిబ్బంది శాలువలు కప్పి బొకేలు అందజేసి బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంఈవో–2 వెంకటరమణమూర్తి నూతనంగా బాధ్యతలు స్వీకరించగా జి.ఎం. కొత్తూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాల(బాలుర)–1 పీజీ హెచ్‌ఎం బాలరాజు, ఆశ్రమోన్నత బాలుర పాఠశాల–2 పీజీ హెచ్‌ఎం ప్రదీప్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. మండల యుటీఎఫ్ అధ్యక్షుడు శ్రీను, ఉపాధ్యాక్షులు గంగాధర్, సత్యానారాయణ,సింహచలం, చిరంజీవి, రామయ్య కళారావు శాలువ కప్పి వేర్వేరుగా సన్మానించారు. విద్యాశాఖ సిబ్బంది, సీఆర్‌పీలు ఎంఈవో–2కి శాలువ కప్పి బొకే అందంజేసి అభినందనలు తెలియజేసారు. ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన



పడాల్‌పుట్టులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ పడాల్‌పుట్టు, మలకర్రిపుట్టు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మండల వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ పాల్గొని రైతులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. గోమూత్రము, పేడ, వేప ఆకులతో నీమాస్త్రం ద్రావణం తయారీని తెలియజేశారు. పురుగుల మందు వాడకంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పురుగు మందుల వినియోగంతో పంటలకు నష్టాలు కలుగుతాయన్నారు. సేంద్రియ ఎరువుల వాడడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చని, రైతులంతా ఖచ్చితంగా వ్యవసాయశాఖ ద్వారా తెలియజేసే పద్ధతులు పాటిస్తూ వ్యవసాయం చేయాలని ఆయన కోరారు. సర్పంచ్ శివ శంకర్, ప్రకృతి వ్యవసాయం మండల కో–ఆర్డినేటర్ కె.ఆనంద్, వీహెచ్‌ఏ నారిమణి, వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది, అధిక సంఖ్యల్లో రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందజేయాలి



మాట్లాడుతున్న నేతలు, గ్రామస్తులు

కొయ్యూరు: ఆధార్ తప్పుగా సీడింగ్ చేయడం, భూములు మ్యుటేషన్లు కాకపోవడంతో చాలామంది రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం నగదు రాలేదని పీసా కమిటీ మాజీ కార్యదర్శి గోకిరి చిన్నారావు, ఉపాధ్యక్షులు స్వామినాయుడు అన్నారు. దీనిపై కలెక్టర్ దృష్టి సారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఒకరి ఆధార్ నంబర్ వేరొకరికి లింక్ అవుతున్నాయని, ఈ కారణంగా రైతులకు అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. భూపట్టాలకు ఆధార్ లింక్ లేకపోవడంతో నగదు రాలేదన్నారు. అర్హులందరికీ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. మహిళా రైతులు రాజ్యలక్ష్మి, చిన్నమ్ములు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్



డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు

పాడేరు రూరల్: గుత్తులపుట్టుని మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని గుత్తులపుట్టు మండల సాధన కమిటీ అధ్యక్షుడు సూరిబాబు, నాయకులు రామన్నలు తెలిపారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామల్లో మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిరసనలు, ర్యాలీలు నిర్వహించారు, అనంతరం ఆయన మాట్లాడుతు ప్రజల సౌకార్యర్థం చాలా గ్రామాలకు సమీపం ఉన్న గుత్తులపుట్టును నూతనంగా మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. పాడేరు, పెదబయలు, హుకుంపేట మండలాలు కలుపుకుని సుమారు 16 గ్రామ పంచాయతీలలతో ప్రత్యేక మండల కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మండల సాధన కమిటీతో ప్రత్యేక ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు ఆనంద్, వీరన్న, అప్పలమ్మ, రమణ, పడాల్, ఆశోక్, చంటి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



హట్టగుడలోని సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో శారద,సిబ్బంది



లక్ష్మీపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు



కొమ్మంగిలో అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు

అరకులోయటౌన్: జిల్లా వ్యాప్తంగా తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తల్లిపాలు ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో అరకులోయ, చింతపల్లి, ముంచంగిపుట్టులో బుధవారం జరిగిన కార్యక్రమాల్లో సీడీపీవోలు, సర్పంచ్‌లు, తదితరులు మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారురు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు.బిడ్డ పుట్టిన గంటలోపే శిశువుకు ముర్రుపాలు అందజేయాలని సూచించారు.దీంతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రెండు సంవత్సరాల వరకు శిశువుకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. బాలింతలు తీసుకోవలసిన ఆహార పదార్థాలు, జాగ్రత్తలు తదతర అంశాలను వివరించారు. బిడ్డలు పెరుగుదలలో ఎటువంటి రుగ్మతలను గుర్తించినా వెంటనే వైద్య సిబ్బంది సలహాలను పాటించాలన్నారు. ,ప్రతి రోజు తీసుకొనే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని ఆయన కోరారు. అరకులోయ మండలంలోని చినలబుడు పంచాయతీ హట్టగుడలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో శారద, సూపర్‌వైజర్లు లక్ష్మీ, స్వర్ణ, రామకృష్ణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, సీత, వంజన, నొయినా, ఆశా వర్కర్లు చిన్నమ్మ, లతాశ్రీ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కె.త్రినాథ్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని కొమ్మంగి పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయభారతి, మహిళా పోలీసు సాయిగంగా భవాని, ఏఎన్‌ఎం చెల్లయమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ నవ మోహన కుమార్, వాసవ్య మహిళా మండలి కో–ఆర్డినేటర్లు చిలకమ్మ,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



అప్పాలును పరామర్శిస్తున్న చెట్టి వినయ్ తదితరులు



సుమన్ పార్థీవదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి వినయ్

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ కేంద్రంలో పచ్చకామర్లుతో పడనాయకి సుమన్(27) మృతి చెందారు.వార్త తెలుసుకున్న అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి భర్త, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ బుధవారం సొవ్వ గ్రామం వెళ్లి సుమన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరమర్శించారు. మృతుడి కుటుంబం వైఎస్సార్‌సీపీలో ఉన్నారు. ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా తానున్నానని వినయ్ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ బాకా ఈశ్వరి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, నాయకులు సింహాచలం, అశోక్, నరసింగరావు, గణపతి, సునీల్ తదితరులున్నారు.

అరకులోయటౌన్: మండలంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలుకు రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ బుధవారం తన నివాసానికి వెళ్లి పరామర్శించారు. గత కొన్ని రోజులుగా శెట్టి అప్పాలు టైఫాయిడ్, జాండిస్‌తో బాధపడుతూ వైద్యుల సూచన మేరకు విశ్రాంతి తీసుకుంటునాాన్నారు. ఈ విషయం తెలుసుకున్న వినయ్ బెంజిపూర్ గ్రామంలోని అప్పాలు నివాసానికి వెళ్లి పరామర్శించి, వైద్యుల సూచన మేరకు మందులు తీసుకొని, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి నరసింహమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్ కుమార్, పార్టీ జిల్లా యువజన విభాగ మాజీ అధ్యక్షుడు ఎల్.బి.కిరణ్, నాయకులు మల్లేష్, బాక సింహాచలం, మండియకేడి బాలరాజు, గణేష్, సోమేష్, తదితరులున్నారు.